క్లుప్తంగా

ఆర్‌బీకేల ద్వారా మద్దతు ధర



మామిడికుదురులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మామిడికుదురులో నగరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు గురువారం ప్రారంభించారు. మద్దతు ధరతో రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, సొసైటీ డైరెక్టర్లు కొల్లాబత్తుల మధువాసన్, కాండ్రేగుల శ్రీనివాస్, ఏఈ బి.మృదుల పాల్గొన్నారు.

లక్కవరం విద్యార్థినికి గోల్డ్ మెడల్



ఆకాంక్ష

మలికిపురం: మండలంలోని లక్కవరం నకు చెందిన విద్యార్థిని పెచ్చెట్టి ఆకాంక్ష భగవాన్ శ్రీ సత్య సాయి సేవా సంస్థలు, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. జూనియర్ కళాశాలల విభాగం (ఇంగ్లిష్ మీడియం)లో గోల్డ్ మెడల్ సాధించిన ఆకాంక్ష ఈ నెల 21వ తేదీన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జరిగే బహుమతి ప్రదానోత్సవ సభలో గోల్డ్ మెడల్ అందుకోనుంది.

2,500 ఎకరాల్లో కొబ్బరి తోటలు చనిపోయాయి

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో 2,500 ఎకరాలలో కొబ్బరి తోటలు ఉప్పునీటి ప్రభావానికి గురై చని పోయాయని బీజేపీ నియోజకవర్గ నాయకుల సమావేశం పేర్కొంది. మలికిపురంలో ఇందుకూరి అచ్యుతరామరాజు కార్యాలయంలో గురువారం మలికిపురం మండల అధ్యక్షుడు కాపిశెట్టి కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ కరవాక నుంచి శంకర గుప్తం వరకు కొబ్బరి తోటలు ఉప్పు నీటిలో ముంపునకు గురవుతూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. ఉద్యాన శాఖ అధికారులు తోటలను పరిశీలించి వెళ్లారే తప్ప రైతులకు ఏ ప్రయోజనాలు ఒనగూరలేదని ఆరోపించారు. జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అడబాల రాంబాబు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఇందుకూరి అచ్యుత రామరాజు పాల్గొన్నారు.

వైద్య సేవలపై అవగాహన

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం వైద్య సేవలపై అవగాహన సదస్సు జరిగింది. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలకు ఆయుష్మాన్ భారత్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు.

దుప్పట్ల పంపిణీ

సఖినేటిపల్లి: వీవీమెరకలో చింతా కోటమ్మ, సూర్యప్రకాశరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మోరి వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు శంకరరావు, వైఎస్సార్ సీపీ నేత కేఎస్ఎన్ రాజు ఈ పంపిణీ చేశారు. చింతా సుధాకర్‌రావు, జగదీష్ వీటిని సమకూర్చారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, ఉపసర్పంచ్ చెంపాటి రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఘనంగా అల్వార్ నక్షత్ర ఉత్సవాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మనవాళ్ల మహాముని ఆల్వార్ తిరు నక్షత్ర ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవం జరిపారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు వెళ్లిన కార్యకర్తలు

ఆలమూరు: రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రమైన కొత్తపేటలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వేలాది మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ర్యాలీగా బయలుదేరారు. వందలాది వాహనాలతో నిర్వహించిన బైక్ ర్యాలీ ఆకట్టుకుంది.

సాధికారతను ఆచరణలో చూపిన సీఎం జగన్



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి. వేదికపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు



దివంగత సీఎం వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందర్ రెడ్డి విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి, ఎంపీలు బోస్, భరత్, అనూరాధ



మెర్లపాలెంలో బైక్ ర్యాలీగా వెళుతూ..

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- రావులపాలెం నుంచి కొత్తపేట వరకూ సాగిన భారీ మోటార్ ర్యాలీ
- జన సంద్రమైన కొత్తపేట
- పండగలా సామాజిక సాధికార బస్సుయాత్ర

కొత్తపేట: సామాజిక సాధికారత అంటే ఏమిటో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో చూపించారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ సాధికారత బస్సు యాత్ర ఎంతో అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రకు నియోజకవర్గ వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. కోనసీమ ముఖద్వారం రావులపాలెం నుంచి యాత్ర ప్రారంభం కాగా బస్సుకు ముందు వేలాది సంఖ్యలో మోటారు సైకిళ్లతో పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ర్యాలీ, బస్సు యాత్ర నియోజకవర్గ కేంద్రం కొత్తపేట చేరుకోగా మెయిన్‌రోడ్డుతో పాటు ఇతర రోడ్లన్నీ జనంతో నిండిపోయి పట్టణం జన సంద్రమైంది. పార్టీ నాయకులు, కార్యకర్తలే కాక, పార్టీ అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమం పండగ వాతావరణాన్ని తలపించింది. స్థానిక పాతబస్టాండ్ సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అధ్యక్షత వహించగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పెద్దఎత్తున ప్రజలు తరలి వచ్చారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో జన సంక్షేమానికి, సామాజిక సాధికారతకు నిర్వచనం చెప్పి, అందుకు చిరునామాగా నిలిచింది జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమేనని అన్నారు. ఇన్నేళ్లూ ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలను ఓటు బ్యాంకుగానే చూశాయని, వాడుకుని వదిలేశాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆయా వర్గాలకు అన్ని విధాలుగా సామాజిక న్యాయం చేకూర్చారన్నారు. వారి సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేశారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మ ఒడి, చేయూత, వివిధ పథకాలను సమర్థవంతంగా, అవినీతి రహితంగా సీఎం జగన్ అమలు చేశారన్నారు. కరోనా వంటి ఎన్ని ఒడుదొడుకులు వచ్చినా, ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా దమ్మున్న నాయకుడిగా దేశంలోనే మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. అన్ని వర్గాల ప్రజలు రాష్ట్రంలో సుభిక్షంగా ఉన్నారని, ముఖ్యంగా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం చేకూర్చారని అన్నారు. వివిధ పథకాల కింద నియోజకవర్గంలో సుమారు రూ 2,109.17 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. లబ్ధిదారుల్లో 90శాతం వరకు ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలకు చెందినవారు ఉన్నారన్నారు. అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కొప్పెన శివనాగు, ఎంపీపీలు మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యులు గూడపాటి రమాదేవి, కుడుపూడి శ్రీనివాసరావు, బోణం సాయిబాబు, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు కప్పల శ్రీధర్, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, ఏఎంసీ చైర్మన్లు రెడ్డి రవీదేవి, యనమదల నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, దొమ్మేటి అర్జునరావు, కనుమూరి శ్రీనివాసరాజు, తమ్మన శ్రీను, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, రావులపాలెం చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, నియోజకవర్గ పార్టీ నాయకులు ఎంఎస్ఆర్, కర్రి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

తండోపతండాలుగా..

ఆత్రేయపురం: కొత్తపేట నియోజకవర్గంలో బుధవారం చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు మండల పరిధిలోని 17 గ్రామాల నుంచి భారీగా వైఎస్సార్ సీపీ క్యాడర్ తరలివెళ్లారు. పార్టీ జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి శ్యామ్‌సన్, సర్పంచ్‌లు పాలా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బైక్, ఆటోలపై ర్యాలీగా తరలివెళ్లారు.



రావులపాలెం సెంటర్‌లో కొబ్బరి బొండాల గజమాలతో స్వాగతం



కొత్తపేటలో పార్టీ జెండాలతో వినూత్న స్వాగతం



కొత్తపేటలో బహిరంగ సభకు హాజరైన మహిళలు

వైఎస్సార్ వల్లే సహకార రంగం మనుగడ



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: రైతు రుణాల మాఫీ ద్వారా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సహకార రంగానికి జవసత్వాలు తీసుకువచ్చారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మామిడికుదురులో నగరం పీఏసీఎస్ కార్యాలయం వద్ద చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్ ఆధ్వర్యంలో గురువారం సహకార వారోత్సవ సభ జరిగింది. సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. సొసైటీ ప్రాంగణంలోని మాజీ ఎమ్మెల్యే నయినాల గణేశ్వరరావు విగ్రహానికి నివాళులర్పించారు. సొసైటీలు నిర్వీర్యం అయిపోయే పరిస్థితి వచ్చిన సందర్భంలో రాజశేఖరరెడ్డి రైతు రుణమాఫీ చేయడం వాటికి వరంగా మారిందన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పాల్గొన్నారు. సర్పంచ్ గోస్ మొహిద్దీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీఓ ఎ.రాధాకృష్ణారావు, డీసీఏఓ ఎస్.మురళీకృష్ణ, వారోత్సవాల ఇన్‌చార్జ్ ఆదిమూలం వెంకటేశ్వరరావు, సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి ఏసునాయన, నోడల్ అధికారి మూర్తి, ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, సొసైటీ డైరెక్టర్లు కాండ్రేగుల శ్రీనివాస్, కె.మధువాసన్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, టి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంకండి

ఎమ్మెల్యే వర ప్రసాదరావు

మలికిపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు వైఎస్సార్ సీపీకి చెందిన అన్ని విభాగాలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు సూచించారు. రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం కత్తిమండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజోలు నియోజకవర్గ బూత్ కమిటీలను ప్రకటించారు. నియోజక వర్గ బూత్ కమిటీల కోఆర్డినేటర్‌గా మలికిపురం గ్రామానికి చెందిన కొల్లాబత్తుల అశోక్‌కుమార్, సఖినేటిపల్లి మండలానికి ఎల్లమెల్లి కిషోర్, పల్లికొండ మూర్తి, మలికిపురం మండలానికి కడలి బాబి, కానూరి బాబి, రాజోలు మండలానికి సాయిరాం, మంచికంటి బోస్, మామిడికుదురుకు ఉచ్చుల మోహన్‌ను కన్వీనర్లుగా నియమించారు. వీరందరినీ ఎమ్మెల్యే శాలువాలు కప్పి అభినందించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయడంలో బూత్ కమిటీలు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. కేఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా బాలాజీ కల్యాణం



కల్యాణ వేదికపై కొలువు తీరిన శ్రీబాల బాలాజీ స్వామి

మామిడికుదురు: నిత్య కల్యాణం పచ్చతోరణంగా భక్తుల పూజలందుకుంటున్న అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి కల్యాణోత్సవం గురువారం ఈదరాడలో కన్నుల పండువలా జరిగింది. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా శివాలయం ప్రాంగణంలో స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. శ్రీదేవి, భూదేవిని బాలబాలాజీ స్వామి పరిణయమాడారు. వేద పండితుడు జ్యోత్స్నుల సోమయాజులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. భక్తులు గోవింద నామ స్మరణలతో కల్యాణోత్సవాన్ని వీక్షించి, అక్షతలు, అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన కల్యాణోత్సవంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు కొమ్ముల సూరిబాబు, చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, బత్తుల గంగారత్నం, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌లుగా ప్రమాణ స్వీకారం

ఆలమూరు: మండలంలోని చెముడులంక, చొప్పెల్ల గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లుగా దొండపాటి వీర వెంకట్రావు (చంటి), తోరాటి దుర్గారావు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. పెద్ద మనుషుల ఒప్పందంలో భాగంగా ఇప్పటి వరకూ ఆయా గ్రామాల్లో ఉప సర్పంచ్‌లుగా పనిచేసిన అడబాల వెంకట్రావు, సుంకర కామరాజు రాజీనామా చేశారు. దీంతో జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఎన్నికల నిర్వాహణాధికారి అడబాల శ్రీనివాసరావు సమక్షంలో నిర్వహించిన ఎన్నికలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చేతల ప్రభుత్వంగా చెరగని ముద్ర

రాజోలులో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు



రాజోలులో బైపాస్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: ఇచ్చిన హామీలను నూరుశాతం నెరవేరుస్తూ ప్రజల గుండెల్లో చేతల ప్రభుత్వంగా వైఎస్సార్ సీపీ సర్కారు చెరగని ముద్ర వేసుకుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం రాజోలులో రూ.90 లక్షలతో నిర్మించిన బైపాస్ రోడ్డు, దానికి అనుసంధానంగా రూ.30లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్‌ను ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. గ్రామంలో గడప గడపకూ నిధులు రూ.80 లక్షలతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. రాజోలు జెడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వేదికపై సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. గతంలో బైపాస్ రోడ్డు నిర్మాణంపై ఎలాంటి శ్రద్ధ చూపని పార్టీలు అనేక రకాలుగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేశారన్నారు. ప్రస్తుతం చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణంతో ప్రతిపక్షాల నోటికి తాళం పడిందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల మనోహర్, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టా ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యులు చెల్లంగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, నాయకులు దార్ల పెదబాబు, బండారు కాశీ, తెన్నేటి కిషోర్, కొప్పాడి దుర్గారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం



గోగన్నమఠంలో పార్టీ పతాక ఆవిష్కరణలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

మామిడికుదురు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని క్లిష్ట పరిస్థితుల నుంచి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు పేర్కొన్నారు. మన రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం గోగన్నమఠంలో జరిగింది. సర్పంచ్ అల్లు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో నాలుగున్నర ఏళ్లలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిన ఆర్థిక సహాయం, తదితర అంశాలతో కూడిన శిలాఫలకాన్ని, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, పార్టీ నేత భూపతిరాజు సత్తిబాబు రాజు, పీఏసీఎస్ చైర్మన్లు సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, కటకంశెట్టి ఆదిత్యకుమార్, సూరిశెట్టి బాబి, ఎండీవై షరీఫ్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీకి సీఎం జగనన్నే ఎందుకు కావాలంటే..

పి.గన్నవరం: మానేపల్లిలో సుమారు రూ.22 కోట్లతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్‌కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు అన్నారు. గ్రామంలో మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జరిగింది. అభివృద్ధి కార్యక్రమాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు పితాని నర్సింహరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, పార్టీ నాయకులు యన్నాబత్తుల నాగభూషణం, చిట్టూరి రవి పాల్గొన్నారు. బెల్లంపూడిలో జరిగిన కార్యక్రమంలో నాయకులు చింతా నాగేశ్వరరావు, రొక్కాల శాంతారావు, అప్పన సురేష్ పాల్గొన్నారు.

అయినవిల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ అన్నారు. గురువారం అయినవిల్లిలో జగన్ రాష్ట్రానికి ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటికి ఇంటికీ పార్టీ నాయకులు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు ఉన్నారు.

అంబాజీపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేయడంతో ప్రతీ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సచివాలయం వద్ద డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కుసుమె వసంతరావు ఇంటివద్ద సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబురావు, ఎంపీటీసీ సభ్యుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎస్. నాగరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ డి.సత్యమోహన్, సొసైటీ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పి.గన్నవరం ఎంపీపీగా నాగలక్ష్మి ఎన్నిక



పి.గన్నవరం: టీడీపీ, జనసేన పార్టీల మధ్య గతంలో జరిగిన జెంటిల్మన్ ఒప్పందంలో భాగంగా గురువారం జరిగిన ఎన్నికల్లో జనసేనకు చెందిన ఎల్.గన్నవరం–1 ఎంపీటీసీ సభ్యురాలు గనిశెట్టి నాగలక్ష్మి పి.గన్నవరం ఎంపీపీగా ఎన్నిక అయ్యారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఎన్నికల్లో జనసేన అభ్యర్థి నాగలక్ష్మికి 12 ఓట్లు రాగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థిని, కె.ముంజవరం ఎంపీటీసీ కుంపట్ల నరసాయమ్మకు 10 ఓట్లు వచ్చాయి. దీంతో నాగలక్ష్మి ఎంపీపీగా ఎన్నిక అయినట్టు ఎన్నికల అధికారి ఎం.ప్రభాకరరావు ప్రకటించారు. వైస్ ఎంపీపీగా టీడీపీకి చెందిన వాడ్రేవుపల్లి ఎంపీటీసీ సభ్యురాలు చెల్లుబోయిన గంగాభవానీ ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎన్నికల సహాయ అధికారులుగా స్థానిక ఎంపీడీఓ ఎం.భారతి, అయినవిల్లి మండల కార్యాలయ ఏఓ దీక్షితులు వ్యవహరించారు. గతంలో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలకు మెజార్టీ ఎంపీటీసీ స్థానాలు రావడంతో.. ఎంపీపీ పదవిని టీడీపీ రెండేళ్ల పాటు, జనసేన మూడేళ్ల పాటు నిర్వహించేందుకు అప్పట్లో ఒప్పందం కుదిరింది. ముందుగా టీడీపీకి చెందిన ముంగండ ఎంపీటీసీ సభ్యురాలు అంబటి భూలక్ష్మి రెండేళ్ల పాటు పదవిని నిర్వహించారు. ఒప్పందం ప్రకారం ఎంపీపీ భూలక్ష్మితో పాటు, వైస్ ఎంపీపీ నేలపూడి దామోదర్ (టీడీపీ) ఇటీవల రాజీనామా చేశారు. ఎంపీపీ నాగలక్ష్మి ర్యాలీ నిర్వహించి, మూడు రోడ్ల సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

సంక్షిప్తంగా..

ప్రభుత్వ బడుల్లో క్రీడలకు ప్రాధాన్యం

సఖినేటిపల్లి: ప్రభుత్వ బడుల్లో విద్యతో పాటు క్రీడలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ఎంఈవో–1 డి.కిషోర్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం టీచర్లు, పీఈటీలకు ఆయన నిర్వహించారు. వచ్చే నెలలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉన్నందున తగిన తర్ఫీదు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఇచ్చేందుకు శిబిరం ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రిలో రికార్డుల తనిఖీ

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల పశువుల ఆస్పత్రిలో ఆలమూరు పశుసంవర్ధక శాఖ ఏడీ ఎల్.అనిత ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి పశువులకు అందిస్తున్న సేవలు, అమలు చేస్తున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. పశువుల మందులకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ కొరత లేకుండా చూడాలని ఆమె ఆదేశించారు. గ్రామంలో పశువుల అధిక సంఖ్యలో ఉన్నందున అదనపు పశు వైద్యుడిని నియమించాలని పాడి రైతులు విజ్ఞప్తి చేశారు. పశు వైద్యాధికారి జి.భానుప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా పడి పూజ

ఆలమూరు: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో 18 మెట్ల పడిపూజ గురువారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు ఎం.ముకేందర స్వామి ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితులు అంగర వేణుగోపాలాచార్యులు పడిపూజ నిర్వహించారు. గురుస్వామి వంటిపల్లి సతీష్ దంపతులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగర సింగ్ బాబు 18 మెట్ల ఆవశ్యకతను వివరించారు.

జగనే మరోసారి సీఎం కావాలి

మలికిపురం: రాష్ట్రానికి జగనే సీఎంగా మరోసారి కావాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని చింతలమోరి సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రాపాక మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. చింతలమోరి గ్రామంలో 27 కోట్ల 16 లక్షల రూపాయలతో ఇంతవరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. గ్రామంలో 8,666 లబ్ధిదారులకు ఇంతవరకు సంక్షేమ పథకాలు అందాయని తెలియజేశారు. ఇన్ని ప్రయోజనాలు కల్పించిన సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి, ఎంపీటీసీ సభ్యుడు తోటే రాజేష్, రాపాక వెంకట్రావ్, జేసీఎస్ కన్వీనర్ చింత రాజబాబు, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లిశివకుమార్, ఉప సర్పంచ్ బాలగంగాధర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపాలెం ఫీడర్ పరిధిలోని తొత్తరమూడి, మాగాం, కె.జగన్నాథపురం గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాను అయిదు గంటల పాటు నిలిపివేస్తున్నట్లు అయినవిల్లి అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అమలాపురం విద్యుత్‌శాఖ ఈఈ ఎం.రవికుమార్ ఆదేశాల ప్రకారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేసి చెట్ల నరికివేత పనులు నిర్వహిస్తామన్నారు.

ఉద్యమకారుల త్యాగఫలమే గ్రంథాలయాలు

అంబాజీపేట: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమ కారుల చిత్రపటం వద్ద గురువారం నివాళులు అర్పించారు. రిటైర్డ్ గ్రంథాలయాధికారి మట్టపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటం వద్ద లైబ్రేరియన్ వై.వెంకట లక్ష్మి నివాళులర్పించారు. విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. పోటీలకు టీచర్ బి.నాగేశ్వరరావు పర్యవేక్షకుడిగా వ్యవహరించారు.

వ్యాసరచన పోటీలు

మామిడికుదురు: స్థానిక గ్రంథాలయ నిర్వాహకుడు కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8,9,10 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

అయినవిల్లి: ముక్తేశ్వరం వైబీఎస్ అండ్ బీఆర్‌ఎం ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను కళాశాల కరస్పాండెంట్ వై.కుమారస్వామి ప్రారంభించారు. విద్యార్థినీవిద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు.